సాక్షి
కుమురం భీం

గురువారం : 17 : ఏప్రిల్ : 2025



అధికారికంగా 'అమరుల సంస్మరణ'

ఇంద్రవెల్లిలో తొలిసారి అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను ఆదిలాబాద్ కలెక్టర్, అధికారులు పరిశీలించారు. 8లో▸



కానరాని ఆర్టీసీ సేవలు

లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఆసిఫాబాద్ డిపో నుంచి కొద్దిరోజులు మాత్రమే బస్సు నడిపారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.3 /27.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. స్వల్పంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగటిపూట వేడి, ఉక్కపోత అధికమవుతుంది.

న్యూస్‌రీల్

'దాసోజు'ను కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రావణ్‌ను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల ఎమ్మెల్యే నివాసంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌తో గాలికుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు విజయ్, పరిమళ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు!



అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ శివారుల్లోని సర్వే నం.83లోని కేశవనాథ స్వామి ఆలయ భూముల్లో అదే గ్రామానికి చెందిన కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతుండడంతో బుధవారం దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఇటీవల ఆలయ భూములకు వేలం నిర్వహించేందుకు తేదీని ప్రకటించారు. గోవింద్‌పూర్‌లో వేలానికి సంబంధించిన పోస్టర్ అంటించేందుకు దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి వేణుగోపాల్ గుప్తా, బాపిరెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, అటెండర్ రాజేశ్వర్, అలయ అర్చకుడు నరేశ్‌శర్మ, కమిటీ సభ్యులు మనోజ్‌కుమార్, సుగుణాకర్ వెళ్లారు. ఆలయం భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న వారిని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. నిర్మాణాలను తొలగించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

'రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు'



నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అఘాయిత్యాలు పెరిగాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. నల్గొండ జిల్లాకు చెందిన మల్లీశ్వరికి నివాళిగా బుధవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఏడేళ్లు సహజీవనం చేసిన తర్వాత మల్లీశ్వరిని యువకుడు మోసం చేసి వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడని, బాధితురాలు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యకు కారణమైన నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. మహిళలకు రక్షణ కల్పించలేని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, రమాదేవి, లావణ్య, కమల, బీనా మండల్, రింకు మండల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలని పర్మినెంట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు హర్షద్ హుస్సేన్ కోరారు. ఆదిలాబాద్ కార్మికశాఖ సీనియర్ అసిస్టెంట్ హరికృష్ణకు బుధవారం లేఖ అందజేశారు. హక్కులు సాధించుకోవాలంటే 'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలన్నారు.

అక్రమాలకు కేరాఫ్..!



కాగజ్‌నగర్‌లోని ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ద్వారా నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ నెల 9న తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 45 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. బెజ్జూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి పేరు మీద విత్తనాల సంచి వచ్చినట్లు గుర్తించారు. పట్టుబడిన విత్తనాల విలువ రూ.1,57,500 ఉంటుందని అధికారులు తెలిపారు... ఇలా పలు ట్రాన్స్‌పోర్టుల ద్వారా జిల్లాలోకి అక్రమంగా నకిలీ విత్తనాలు, ట్యాక్స్ లేని వస్తువులు సరఫరా అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



కాగజ్‌నగర్‌లోని ఒక ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

- నిషేధిత వస్తువుల రవాణాకు అడ్డాలుగా ట్రాన్స్‌పోర్టులు
- ఇటీవల నకిలీ విత్తనాలు పట్టివేత
- అక్రమార్కులకు వరంగా మారుతున్న వైనం

చింతలమానెపల్లి(సిర్పూర్): వివిధ ప్రాంతాల నుంచి వస్తువులు తరలించడానికి జిల్లాలో ట్రాన్స్‌పోర్టు కంపెనీలు తమ కార్యాలయాలు ఏర్పాటు చేశాయి. వీటి ద్వారా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు నిత్యం భారీఎత్తున సరుకులు చేరవేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో సుమారు 15 ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, ఆసిఫాబాద్‌లో మరో 15 ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉన్నాయి. ఇవే కాకుండా స్థానిక ట్రాన్స్‌పోర్ట్‌లు కూడా ఉన్నాయి.

సులువుగా సరుకు రవాణా

వస్తువులు, అనుమతి ఉన్న, ప్రజా అవసరాల సరుకులు రవాణా చేయడానికి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉపయోగపడుతున్నాయి. అలాగే అక్రమ వస్తువులు, అనుమతి లేని, నిషేధం ఉన్న వస్తువులు, సరుకులు కూడా గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల ద్వారా నిత్యం గ్రామీణ ప్రాంతాలకు సరుకు రవాణా జరుగుతోంది. వీటిని అనుకూలంగా మార్చుకున్న వ్యాపారులు తమకు కావాల్సిన సరుకును తరలించేందుకు ట్రాన్స్‌పోర్టులను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా ఏటా జిల్లాలోకి వర్షాకాలం సీజన్‌కు ముందే జనవరి, ఫిబ్రవరి నుంచి జిల్లాలోకి నకిలీ పత్తి విత్తనాలు డంప్ చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఈ ట్రాన్స్‌పోర్టులను వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిఘా కరువు

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల వాహనాల ద్వారా తరలించే వస్తువులు, కార్యాలయాలపై నిఘా తక్కువగా ఉంటోంది. కార్యాలయాల నిర్వహణ, వాహనాల్లో సరుకు రవాణాకు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుంటాయి. కానీ నిత్యం భారీ సంఖ్యలో తరలించే వస్తువులపై నిఘా ఏర్పాటు చేయడం ఆయా శాఖలకు తలకు మించిన భారంగా మారింది. పోలీస్, విజిలెన్స్, ఎక్సైజ్ శాఖలు మాత్రమే అడపాదడపా తనిఖీ చేపడుతున్నాయి. పూర్తిస్థాయి ప్యాకింగ్‌తో వచ్చే పార్సిళ్లను పరిశీలించడం సిబ్బందికి కష్టమవుతోంది. ఇది అక్రమంగా వస్తువులను తరలించి సొమ్ము చేసుకునే వారికి వరంగా మారుతోంది. నకిలీ విత్తనాలు, నిషేధిత మందులు, ట్యాక్స్‌లు చెల్లించని వస్తువులు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల ద్వారా తరలిస్తున్నారు. తద్వారా భారీగా ఆదాయం గడిస్తున్నారు. మరోవైపు మార్కెట్‌లో నిషేధిత వస్తువులు, నాణ్యత లేని సరుకు వినియోగిస్తూ సాధారణ ప్రజలు నష్టపోతున్నారు. కల్తీ వస్తువులు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. అవగాహన లేకపోవడంతో జిల్లాలోని గిరిజన ప్రజలు సులువుగా మోసపోతున్నారు.

పోలీసుశాఖ దృష్టి

వర్షాకాలం సీజన్‌కు ముందే ఇటీవల భారీగా నకిలీ విత్తనాలు సరఫరా కావడం కలకలం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారంతో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలోనూ నిషేధిత విత్తనాలు పట్టుబడడంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల కార్యకలాపాలపై దృష్టి సారించింది. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు ఇటీవల తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా నకిలీ విత్తనాలు జిల్లాలోని మార్కెట్లను ముంచెత్తే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతోపాటు ట్రాన్స్‌పోర్టు కంపెనీలపై నిఘా ఉంచితే నిషేధిత విత్తనాలు, పురుగు మందులు, ట్యాక్స్ లేని వస్తువులు, సరుకుల దిగుమతిని పకడ్బందీగా అడ్డుకోవచ్చు.

నిఘా పెంచాం

ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలపై నిఘా పెంచాం. ఎస్పీ ఆదేశాల మేరకు నకిలీ పత్తి విత్తనాల సరఫరాపై ప్రధానంగా దృష్టి సారించాం. వీటితోపాటు అనుమతులు లేని నకిలీ వ్యవసాయ మందులు, ఉత్పత్తులు, గ్లైఫోసెట్ రౌండప్ మందులపైనా నిఘా ఉంటుంది. ఎవరైనా అక్రమంగా రవాణా చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

– రాణాప్రతాప్, టాస్క్‌ఫోర్స్ సీఐ, కాగజ్‌నగర్

స్పౌజ్ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి అవకాశం
- ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నలుగురు, మంచిర్యాలకు ఇద్దరు..



జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

ఆదిలాబాద్‌టౌన్: స్పౌజ్ బదిలీలకు ప్రభుత్వం మరోసారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల 38 మంది స్పౌజ్ ఉపాధ్యాయులు (భార్య, భర్త) ఇతర జిల్లాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పౌజ్ బదిలీలకు సంబంధించి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆరుగురు సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు నలుగురు స్కూల్ అసిస్టెంట్లు (తెలుగు) బదిలీపై రానుండగా, ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు ఇద్దరు సాంఘిక శాస్త్రం ఎస్‌ఏలు బదిలీపై వెళ్లనున్నారు. 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఊరట కల్పించింది.

23న రిలీవ్..

సంబంధిత జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈనెల 22న రిలీవ్ అయి వారికి కేటాయించిన జిల్లాలో 23న విధుల్లో చేరాలని విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఇటీవల మ్యూచువల్ బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ జిల్లాకు 24 మంది మ్యూచువల్ బదిలీపై రానుండగా, అదే సంఖ్యలో ఇతర జిల్లాలకు ఇక్కడి నుంచి వెళ్లనున్నారు. మంచిర్యాల నుంచి ఓ సీనియర్ అసిస్టెంట్ డీఈవో కార్యాలయానికి రానుండగా, ఇక్కడి నుంచి ఒకరు మంచిర్యాలకు వెళ్లనున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్‌తో కలిసి భూభారతి చట్టం అమలు, సన్నబియ్యం పంపిణీ, నకిలీ విత్తనాల అక్రమ రవాణాపై చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అర్హుల జాబితా రూపకల్పన, వేసవిలో తాగునీటి సరఫరా అంశాలపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో రైతులకు మేలు కలిగే విధంగా అప్పీలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. విరాసత్, పాలు పంపకాలు, కొనుగోలు పట్టా మార్పిడిలో సంబంధీకులకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందన్నారు. భూభారతి చట్టంపై ఈ నెల 17 నుంచి 30 వరకు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 314 పౌరసరఫరాల దుకాణాల ద్వారా ఇప్పటివరకు 90 శాతం సన్నబియ్యం పంపిణీ పూర్తయిందని వివరించారు. జిల్లాలో 80 శాతం పత్తి సాగవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు విక్రయించకుండా విస్తృత స్థాయిలో తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, ఎస్సై, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. పైలట్ గ్రామాల్లో విడతల వారీగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. మిగిలిన గ్రామాల్లో అర్హుల జాబితా రూపొందించేందుకు మండలస్థాయిలో గెజిటెడ్ స్థాయి అధికారులతో గడపగడపకూ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా శుద్ధమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరా చేయలేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. మిషన్ భగీరథ అధికారులతో ప్రతిరోజూ అదనపు కలెక్టర్ సమీక్షిస్తున్నారన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. విత్తన విక్రయదారులు నిబంధనల ప్రకారం ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

మోటర్ తెచ్చిన తంటాలు



ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న కార్మిక కుటుంబాలు, ఐఎన్‌టీయూసీ నాయకులు

- నాలుగు నెలలుగా తరచూ కాలిపోతున్న వైనం
- మాదారం టౌన్‌షిప్ కాలనీవాసులకు తప్పని నీటి కష్టాలు
- సమస్య పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయింపు

రెబ్బెన/బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్‌లో కార్మికులు, కార్మికేతర కుటుంబాలను జనవరి నుంచి నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తరచూ మోటర్లు కాలిపోతుండగా, మరమ్మతులకు గరిష్టంగా రెండు వారాలపైనే సమయం పడుతోంది. వేసవి కావడంతో నీటి కోసం కాలనీ ప్రజలు అల్లాడుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి మరోసారి మోటర్ చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మాదారం కాలనీవాసులకు మహావీర్‌ఖని(ఎంవీకే) -1 ఇంక్లైన్ సమీపంలో వేసిన బోర్‌లో మోటర్ బిగించి అంతర్గత పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. అయితే అంతుచిక్కని కారణాలతో ఇక్కడ ఏర్పాటు చేసిన పంపు మోటరు తరచూ చెడిపోతోంది. నాలుగు నెలల్లో నాలుగుసార్లు మరమ్మతులకు గురైంది. గడిచిన నెలన్నర వ్యవధిలోనే రెండుసార్లు చెడిపోయిందని స్థానికులు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు సింగరేణి జీఎం రెండు కొత్త పంపు మోటర్లను తెప్పించారు. 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటర్లు తీసుకురాగా, అవి బోర్ హోల్‌లో పట్టలేదు. కొత్తగా బోరులో పట్టే మోటర్లను తీసుకువచ్చి బిగించడం లేదా 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటర్లకు సరిపడేలా కొత్త బోరు హోల్ వేయడమో చేస్తేగానీ నీటి సమస్య తీరే అవకాశం కనిపించడం లేదు.

రోడ్డుపై కాలనీవాసుల ఆందోళన

తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మాదారంటౌన్ షిప్ కార్మిక కుటుంబాల మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. కైరిగూడ ఆర్చీ వద్ద సింగరేణి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మాదారం టౌన్‌షిప్‌లో నెలలో పది నుంచి పద్నాలుగు రోజులపాటు నీటి సరాఫరా లేకపోతే కార్మిక కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. నీటి సరాఫరా నిలిచిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరాఫరా చేస్తూ చేతులు దులుపుకొంటున్నారన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే జీఎం కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్వోటూజీఎం రాజమల్లు సంఘటన స్థలానికి వెళ్లి ఐఎన్‌టీయూసీ, కార్మిక కుటుంబాలతో మాట్లాడారు. రెండు రోజుల్లో పంపులకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్మిక కుటుంబాలకు మద్దతుగా ఏఐటీయూసీ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. సెంట్రల్ కమిటీ నాయకులు ప్రకాశ్‌రావు, రామారావు, ఏరియా కార్యదర్శి చంద్రకుమార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, కార్మికులు అనిల్, పోశం, శంకర్, రఘునాథరెడ్డి, రమేశ్, సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం.. సేవలకు ప్రాధాన్యం

- జిల్లాలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు
- మత్తు పదార్థాల వినియోగం అరికట్టడమే లక్ష్యం
- గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పోటీలు నిర్వహణ, కిట్లు అందజేత

కౌటాల(సిర్పూర్): శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకం.. వారికి బాధ్యతలు, ఒత్తిళ్లు ఎక్కువే.. అడవుల జిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతాన్ని గంజాయి, గుట్కా, గుడుంబా ఇతర వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువత, ప్రజలు బానిసలుగా మారుతున్నారు. ఈ క్రమంలో పోలీసుశాఖ 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలతో మమేకమవుతూనే.. అక్రమాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేక చొరవ..

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, గుండుబా, గుట్కా, మట్కా, బెట్టింగ్ కట్టడికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. వాటి వినియోగంతో కలిగే అనర్థాలను తెలియజేసేందుకు నేరుగా ప్రజల మధ్యకు వెళ్తున్నారు. మారుమూల గ్రామాల్లో పర్యటించి ప్రజల అవసరాలు, వారి జీవన విధానం తెలుసుకుంటున్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కార మార్గం కాదంటూ.. ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా.. వాటి పరిష్కారంలో యువత కీలక భూమిక పోషిస్తుంది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చదువుపై దృష్టి సారించడంతోపాటు యువత చెడుమార్గంలో వెళ్తే జరిగే అనర్థాలను వివరిస్తున్నారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు యువత భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు.

మత్తు వదిలేలా..

ప్రజలతో ఎస్పీ శ్రీనివాసరావు మమేకం కావడమే కాకుండా జిల్లాలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అన్ని మండలాల్లో పోలీసులు- మీ కోసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో గుడుంబా, గుట్కా నియంత్రణపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో నేరాలు అరికట్టేందుకు ప్రధాన కూడళ్లు, కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కేసులను పరిష్కరించడంలో దోహదపడుతున్నాయి. సీసీ కెమెరాల సాయంతో గతేడాదితో తొమ్మిది కేసులు పరిష్కారమయ్యాయి. గతేడాది వివిధ కార్యక్రమాల్లో భాగంగా 746 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పోలీస్ సబ్ డివిజన్లలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కొన్ని నెలలుగా కాలనీలు, బస్తీల్లో బ్లూకోల్ట్స్ తదితర సిబ్బంది పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. దొంగతనాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.



బోదంపల్లిలో నిరుపేద మహిళకు నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు(ఫైల్)

సేవా కార్యక్రమాలు సైతం..

- పోలీసులు మీకోసం కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీ, గుడ్ టచ్- బ్యాడ్ టచ్, గంజాయి, ఆన్‌లైన్ మోసాలు, గుట్కా, మట్కా, జూదం, మహిళల భద్రత కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళ భద్రత కోసం షీటీంలు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- ఇటీవల బెజ్జూర్ మండలం నాగవల్లిలో పేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు ఇచ్చారు. వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జైనూర్‌లో ఆదివాసీ మహిళలకు 35 కుట్టు మిషన్లు అందించారు.
- రెబ్బెన మండలం గోండుగూడ, కాగజ్‌నగర్ డివిజన్‌లోని కనికి, తుమ్మిడిహెట్టి, తాటిపల్లి, సిర్పూర్(యూ) మండలం పవర్‌గూడ గ్రామాల్లోని ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గత నెల 12న జైనూర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మార్చి 5న సిర్పూర్-యూ మండలం దుద్దేకాస గ్రామంలో సరుకులు, పండ్లు పంపిణీ చేశారు.
- మార్చి 2న ఏఎస్పీ చిత్తరంజన్ తిర్యాణి మండలం గోవెన, కుర్సిగూడ, నాయకపుగూడ గ్రామాలకు కాలినడకన దాదాపు 20 కి.మీ. దూరం వెళ్లి ఆదివాసీల సమస్యలు తెలుసుకున్నారు. యువతకు వాలీబాల్ కిట్లు, స్పోర్ట్ టీషర్టులు పంపిణీ చేశారు.
- మార్చి 24న కౌటాల పోలీస్ స్టేషన్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదుతోపాటు బహుమతులు అందించారు. బోదంపల్లిలో నిరుపేద మహిళకు పోలీసులు నిర్మించిన ఇంటిని ప్రారంభించారు. తుమ్మిడిహెట్టి గ్రామంలో దుప్పట్లు, వైద్యశిబిరం నిర్వహించారు.

బెట్టింగ్‌కు దూరంగా..



ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాలలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. యువత పోటీల్లో పాల్గొనడంతో బెట్టింగ్‌కు దూరంగా ఉన్నారు. బెట్టింగ్, చెడువ్యసనాల బారిన పడితే కలిగే నష్టాలను వివరించారు. ప్రతీసారి సెలవుల్లో పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహించాలి.

– రవి, మురళీగూడ, మం.పెంచికల్‌పేట్

సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం

నేను విధుల్లో చేరిన మొదట్లో కాగజ్‌నగర్‌లో భర్త తాగుడుకు బానిస కావడంతో ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. ప్రజలు మద్యానికి బానిసై క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. యువత గంజాయి, గుట్కాలను వినియోగించి అనారోగ్యం బారిన పడుతున్నారు. భద్రత కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నాం. – డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

క్లుప్తంగా

ఒకరి రిమాండ్

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో పంచశీల జెండాను అవమానపర్చిన ఎక్కర్ల మహేందర్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న దేగామ గ్రామంలో అంబేడ్కర్ అభిమాన సంఘం సభ్యులు రోడ్డుకు ఇరువైపులా పంచశీలా జెండాలు కట్టారు. ఆ జెండాలు తొలగించి అవమానపర్చినందున కేసు నమోదు చేసి నిందితుడు మహేందర్‌ను రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని సిద్ధార్థనగర్ సమీపంలో మొక్కజొన్న పంట దగ్ధమైంది. బుధవారం బాధిత రైతు ఆరిఫ్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిఫ్‌ఖాన్ 15 ఎకరాల్లో పంట సాగు చేశాడు. పంటను కోసి ఆరబెట్టగా పూర్తిగా దగ్ధమైందని వాపోయాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియడం లేదని, సుమారు రూ.10 లక్షల వరకు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని సంతోషిమాతనగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే దొంగలు పడ్డారు. సీఐ జి. గోపినాథ్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కల్యాణి సురేశ్ మంగళవారం మధ్యాహ్నం తన ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం 7.30 గంటలకు వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా తులం బంగారం, రూ.1000 నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతిని వేధించిన హైదరాబాద్‌కు చెందిన షేక్ రహీమ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఇసాఖ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన యువతికి ఏడాది క్రితం హైదరాబాద్‌లోని షేక్ రహీమ్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెద్దలు వీరి పెళ్లికి ఒప్పుకోగా, అతను మద్యానికి బానిస కావడంతో యువతి పెళ్లికి నిరాకరించింది. దీంతో సోషల్ మీడియాలో యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టు చేయడంతో పాటు మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్ సిలిండర్ చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన నర్వాడి గంగాధర్ మంగళవారం ఖాళీ గ్యాస్ సిలిండర్ చోరీకి యత్నించాడు. ఖుర్షీద్‌నగర్‌లో గ్యాస్‌బాయ్ సిలిండర్‌ను డెలివరీ చేసేందుకు వెళ్లగా గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్తున్న గంగాధర్ ఆయనను చూసి సిలిండర్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. దీంతో గ్యాస్ సిలిండర్ నిర్వాహకులు టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. కాగా ఇతను పాత నేరస్తుడని తెలిపారు.

ముందస్తు ప్రణాళిక.. పంటకు మేలు

వేసవికాలం ప్రారంభమైంది. రైతులు ఎండాకాలంలోనే దుక్కి దున్నడం, చేలు చదును చేయడం, గతేడాది పంట మొదళ్లు, ఇతర అవశేషాలు, చెత్త ఏరికాల్చడం వంటి పనులు చేస్తుంటారు. జూన్ నెలలో తొలకరి వర్షాలు కురవగానే విత్తనాలు సమకూర్చుకుంటారు. రైతులు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా సాగుకు సిద్ధమైతే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ వివరిస్తున్నారు. వేసవిలో రైతులు చేపట్టాల్సిన పనులపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

– మంచిర్యాలఅగ్రికల్చర్

- వేసవి దుక్కులు ఉపయోగకరం
- భూసార పరీక్షలు కీలకం
- వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్


వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

భూసార పరీక్షలు..

పంటకు ముందస్తుగా భూసార పరీక్షలు చేయించాలి. భూసార పరీక్షకు మట్టి నమూనాలు సరైన పద్ధతిలో తీసుకోవాలి. ఈ పరీక్షలతో భూమిలో ఎంత సారం ఉంది.. ఎలాంటి విత్తనాలు, ఎంత మోతాదులో ఎరువులు వేయాలి వంటి విషయాలు తెలుస్తాయి. ఇష్టారీతిగా ఎరువులు వినియోగించి నష్టపోవడం కంటే భూసార పరీక్షలతో పంటల సాగుతీరు మార్చుకోవాలి. భూసార పరీక్షలతో సూక్ష్మ, స్థూల పోషకాల లోపాలు, మోతాదు పద్ధతిలో ఎరువుల వాడకం, అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలుంది. నూతన ఆధునిక యంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు.

నేలలో కలియదున్నితే మేలు..

జిల్లాలో ఏటా పత్తి పంట దిగుబడి అనంతరం పత్తి చెట్ల మొదళ్లను కోసి కుప్పగా చేసి కాల్చివేస్తుంటారు. కొంత వంట చెరుకుగా వినియోగిస్తున్నారు. అలా కాకుండా పత్తి మొదళ్లను వృథా పోకుండా రోటవేటర్ సహాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలి. రోటవేటర్ తర్వాత మల్చ్‌బెల్ట్ నాగలితో దున్నాలి. తర్వాత మరోసారి రోటవేటర్‌తో కలియదున్నాలి. ఈ విధంగా చేయడం వలన భూమి సారవంతమై పత్తి పంటకు బయట నుంచి అందాల్సిన ఎరువులు తగ్గుతాయి.

వేసవి దుక్కులు కీలకం..

ఖరీఫ్ సాగుకు ముందు నుంచే చేలు చదును చేసుకుని నెల రోజుల ముందే వేసవి దుక్కులు దున్నుకోవాలి. తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల తర్వాత భూమిని వదిలివేయకుండా వేసవిలో దుక్కి దున్నుకుంటే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. నేలను లోతుగా దున్నడంతో కొంత తేమలో ఉన్న కీటకాలు నశిస్తాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకోవడానికి భూమిని దున్నుకోవాలి. ఈ వర్షాలతో లోతుగా దున్నడం వల్ల వరుసకు వరుస మధ్యలో వర్షపు నీరు నిలుస్తుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, శాస్త్రవేత్తలు సూచించిన చెరువు మట్టిని పొలంలో వేసుకుంటే పంట దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది. సేంద్రియ ఎరువులు అందించడం ద్వారా సూక్ష్మ పోషక లోపాలు నివారించవచ్చు. లోతు తక్కువ ఎర్రచల్క నేలల్లోనూ అడుగున గట్టిగా ఉన్న నేలల్లోనూ లోతుగా దుక్కి చేయడం చాలా ఉపయోగంకరంగా ఉంటుంది. నేలను 35 సెం.మీ నుంచి 40 సెం.మీ వరకు లోతుగా దున్నుకుంటే భూమిలో గట్టిపార పగిలి నేల బాగా గుల్ల బారుతుంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. లోతు దుక్కి ప్రభావం 2 నుంచి 3 సంవత్సరాల వరకు ఉంటుంది.

అధికారికంగా అమరుల సంస్మరణ దినోత్సవం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఇంద్రవెల్లి: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మొదటిసారిగా అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. బుధవారం ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్‌లతో కలిసి మండలంలోని అమరవీరుల స్తూపాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సంస్మరణ దినోత్సవం నిర్వహణపై రాయిసెంటర్ సార్ మెడీలు, అమరుల ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ పెద్దలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ అమరవీరుల స్తూపాన్ని వివిధ రకాల పూలతో అలంకరించాలని తెలిపారు. 1981లో జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించిన ఫొటోలతో పాటు ఆదివాసీ సంస్కృతికి చెందిన ఫొటోలను సేకరించి మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్ 20 సంస్మరణ దినోత్సవం రోజు రాష్ట్ర మంత్రి సీతక్క అమరుల కుటుంబాలకు ట్రైకర్ ద్వారా మంజూరైన వాహనాలు, యూనిట్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. వానాకాలంలో స్మృతివనంలో మొక్కలు నాటి వంద శాతం పనులు పూర్తయిన తరువాత స్మృతివనాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మన్ తొడసం నాగోబారావ్ అమరవీరుల స్తూపం ప్రాంగణంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, తాగునీటి కోసం బోరు మంజూరు చేయాలని, ప్లాస్టిక్ కుర్చీలు, గ్రీన్‌మ్యాట్ మంజూరు చేయడంతో పాటు వాచ్‌మెన్‌ను నియమించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావ్, డీడీ అంబాజీ, ఈఈ తానాజీ, సార్ మెడిలు మెస్రం దుర్గు, మెస్రం చిన్ను, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఆదివాసీ సంఘాల నాయకులు గోడం గణేశ్, మెస్రం నాగ్‌నాథ్, పుర్క చిత్రు, ఆనంద్‌రావ్, నాగోరావ్ ఉన్నారు.

ముగ్గురు మైనర్లపై దొంగతనం కేసు

లక్ష్మణచాంద: ముగ్గురు మైనర్లు దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని పీచర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పీచర గ్రామంలో గొర్రెల కాపరులుగా పనిచేస్తున్న ముగ్గురు మైనర్లు మంగళవారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన రామ్ కిషన్‌కు చెందిన కిరాణాషాపు, అల్లంపెల్లి రవికి చెందిన మెడికల్ షాపులో షెట్టర్ల తాళాలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం మెడికల్ షాపు యజమాని తాళం పగలగొట్టి ఉండడంతో సీసీ కెమెరా పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో బుధవారం ఉదయం షాప్‌లో రూ.6 వేలు నగదు దొంగిలించినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మాలిక్ రెహమాన్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.

పాఠశాలలో విషప్రయోగం కలకలం

- తప్పిన పెను ప్రమాదం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు, నిందితుడు అరెస్ట్

ఇచ్చోడ: మండలంలోని ధర్మంపూరి ప్రాథమిక పాఠశాలలో ఓ వ్యక్తి విషప్రయోగం చేసిన ఘటన కలకలం సృష్టించింది. ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన సిబ్బంది పాఠశాల తాళం పగిలిపోయి ఉండటాన్ని గమనించారు. పాఠశాల గదిలో ఉన్న వంటపాత్రలో తెల్లనినీరు నింపి ఉండటం, వాసన రావడంతో అప్రమత్తమైన ప్రధానోపాధ్యాయురాలు గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్న గ్రామస్తులు వంటపాత్రలు, వాటర్ ట్యాంక్‌లో విషం కలిపినట్లు గుర్తించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పురుగుల మందు డబ్బాను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి ఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. పాఠశాల సిబ్బంది ముందుగా గుర్తించడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ బుధవారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు.


పాఠశాలలో విచారిస్తున్న ఏఎస్పీ కాజల్‌సింగ్

నిందితుడు అరెస్ట్

పాఠశాలలో వంటపాత్రలలో విషం కలిపిన ధర్మంపూరి గోండుగూడకు చెందిన సోయం కిష్టును బుధవారం అరెస్ట్ చేశారు. కొంత కాలంగా కుటుంబ కలహాల కారణంగా మతిస్థిమితం కోల్పోయిన సోయం కిష్టు ఘటనకు పాల్పడినట్లు ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

ధర్మంపూరి ప్రాథమిక పాఠశాలను బుధవారం డీఈవో శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో విష ప్రయోగం జరగడంతో పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో బిక్కు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ ఉన్నారు.

గుండెపోటుతో పూజారి మృతి

లక్ష్మణచాంద: గుండెపోటుతో పూజారి ప్రాణాలు కోల్పోయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన పూజారి పెరుమాండ్ల రమేశ్(75) గత 30 సంవత్సరాలుగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పురోహితుడిగా సేవలు అందిస్తున్నారు. గత ఏడాది నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం తన వద్దకు వచ్చిన ఒకరికి పంచాంగం చూశారు. ఆయన వెళ్లిపోయిన కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలిపోయి మృతిచెందారు. పూజారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


రమేశ్ (ఫైల్)

ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సంతాపం..

పూజారి పెరుమాండ్ల రమేశ్ అకాల మృతి విషయం తెలుసుకున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

దాడికి గురైన వ్యక్తి మృతి

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామపంచాయతీ పరిధి గోపాల్‌పూర్‌లో భార్య, ఆమె ప్రియుడి చేతిలో దాడికి గురైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. కుటుంబ సభ్యులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 9న మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లాండ్గే సాహెబ్‌రావ్(35)పై భార్య ఎల్లవ్వ, ఆమె ప్రియుడు సట్ల దశరథ్‌తో కలిసి గొడ్డలి, రాళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేసింది. స్థానికులు వెంటనే ఆయనను ఆదిలాబాద్ రిమ్స్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడు. పోలీసులు బుధవారం పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టులు.. ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో కత్తులతో ఉన్న నిందితుల ఫొటోలు, వీడియోలను పోస్టు చేసిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు బుధవారం తెలిపారు. ఇటీవల ఇందిరానగర్‌లో జరిగిన హత్య కేసులో నిందితులుగా ఉన్న కార్తీక్, సిద్ధు, సాయిలు కత్తులతో ఫొటోలు దిగగా, వాటికి పాట జతచేసి సోషల్ మీడియాలో కొందరు పోస్టు చేశారు. 302 పవర్ అని పోస్టు చేయడంతో పట్టణంలోని మార్కెట్ యార్డుకు చెందిన కొత్తూరి సాయివర్ధన్, ఇందిరానగర్‌కు చెందిన కావులే ఆశిష్, కొబాడే నితీశ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వీరికి గంజాయి పరీక్షలు చేయగా కొత్తూరి సాయివర్ధన్, కావులే ఆశిష్‌లకు పాజిటివ్‌గా వచ్చిందని తెలిపారు. వీరిపై గంజాయి సేవించిన కేసు సైతం నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోర్టుకు గైర్హాజరు.. అరెస్ట్

బెల్లంపల్లి: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బెలంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కాంట్రాక్టర్ బస్తీకి చెందిన నలిగంటి దయాకర్ అనే వ్యక్తిపై కేసు నమోదు కాగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతున్నాడు. ఈమేరకు నిందితుడిపై నిఘా ఉంచి బుధవారం అరెస్టు చేసి బెల్లంపల్లి జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా జడ్జి ఆదేశాలతో ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

తాండూర్‌లో..

తాండూర్: కోర్టు వాయిదాలకు గైర్హాజరవుతున్న ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన లింగం రాజు అనే యువకుడిపై ఇదివరకు కొన్ని కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో నిందితుడు కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈమేరకు బుధవారం నిందితుడు రాజును అరెస్టు చేసి బెల్లంపల్లి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, జడ్జి ఆదేశాలతో ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన బైక్ దొంగ షేక్ నదీమ్‌ను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటీవల బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను పదిరోజుల కాల వ్యవధిలో దొంగిలించాడు. ఇందిరానగర్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి విచారించగా, మూడు వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

జైనథ్‌లో..

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని మాకోడకు చెందిన బైక్ దొంగ రామెల్లి కిరణ్‌ను వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మావలకు చెందిన రగ్గివార్ ప్రశాంత్ ముథూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 9న కార్యాలయం ఎదుట బైక్ పార్కింగ్ చేయగా, సాయంత్రం వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో ఆయన వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. శివాజీచౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి నిందితుడిని విచారించగా బైక్ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

మట్కా నిర్వాహకుడికి రూ.లక్ష జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడికి రూ.లక్ష జరిమానా విధించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడు లతీఫ్, రెహాన్ తండ్రి, కొడుకులు ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్నారు. ఇదివరకు బైండోవర్ చేయగా బుధవారం ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. తహసీల్దార్ ఎదుట వారిని హాజరుపర్చగా పది రోజుల్లో రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించారు. నిందితుల నుంచి రూ.500, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి మండలంలోని వడగామ్ సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలంలోని లక్కుగూడ గ్రామానికి చెందిన కొరెంగా రాము, కొరెంగా హేమంత్ కుమార్, ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ గ్రామానికి చెందిన బాలుడు జుగ్నాక గౌతంలు ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో మోడిగూడ సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. దీంతో కొరెంగా రాము, కొరెంగా హేమంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. జుగ్నాక్ గౌతంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. రాము, హేమంత్‌కుమార్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.


క్షతగాత్రులను రిమ్స్‌కు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్: సొనాల మండలం సంపత్‌నాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్ దేవిదాస్(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ దేవిదాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 15న మద్యం సేవించి ఇంటికి వెళ్లగా భార్య సుమన్ బాయి మందలించింది. దీంతో దేవిదాస్ తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి రాత్రి 9 గంటలకు భార్యకు విషయం తెలిపాడు. వెంటనే మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవిదాస్ మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్

నేరడిగొండ: గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై శ్రీకాంత్‌లు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం పక్కా సమాచారం మేరకు కుంటాల ఎక్స్‌రోడ్‌లో నేరడిగొండకు చెందిన బత్తుల కిరణ్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా 160 గ్రాముల గంజాయి లభించినట్లు పేర్కొన్నారు. ఆయనను విచారించగా దంసతండా గ్రామానికి చెందిన పెందూర్ లచ్చు అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి తీసుకొచ్చినట్లు తెలిపాడు. కాగా లచ్చును విచారించగా తన వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద నుంచి 290 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 450 గ్రాముల గంజాయి విలువ రూ.11,250 ఉంటుందన్నారు.


గంజాయి స్వాధీనం చేసుకుంటున్న సీఐ భీమేశ్

మావల పరిధిలో..

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అంబదాస్, గాదిగూడ మండలానికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు గంజాయిని తరలిస్తుండగా బుధవారం మావల పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 12 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

భార్యపై గొడ్డలితో దాడి

కోటపల్లి: వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అతడి భార్య లక్ష్మికి విషయం తెలియడంతో ఇంట్లో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో బుధవారం సదరు మహిళతో పున్నం సన్నిహితంగా ఉన్నాడని తెలుసుకున్న లక్ష్మి భర్తను తీవ్రంగా మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన పున్నం పక్కనే ఉన్న గొడ్డలితో లక్ష్మిపై దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు రాజేశ్ అక్కడికి చేరుకుని 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి

దేశీదారు పట్టివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్న దేశీదారు మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని హనుమాన్ బస్తీకి చెందిన ఓ ఇంట్లో దేశీదారు మద్యం బాటిళ్లు అమ్ముతున్నారన్న సమాచారంతో ఎస్‌హెచ్‌వో దేవయ్య మంగళవారం రాత్రి దాడి చేసి 50 90ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దేశీదారు అమ్ముతున్న కోట సారమ్మ అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


పట్టుకున్న దేశీదారు బాటిళ్లతో ఎస్‌హెచ్‌వో దేవయ్య

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో బుధవారం అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. నిపానిలో వీడీసీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బుర్రి అశోక్ అనే వ్యక్తి బెల్ట్‌షాప్ ద్వారా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. తనిఖీలలో అక్రమంగా విక్రయిస్తున్న రూ.26,900 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న అశోక్‌తో పాటు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట ఏఎస్సై ముంతాజ్, సిబ్బంది ఉన్నారు.